సాక్షి
హనుమకొండ
శనివారం | 12 | ఆగస్టు | 2023



చదువు చెప్పని ఉపాధ్యాయులు..
పాఠశాలలో చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దంటూ కాటారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రోడ్డుపై భైఠాయించి నిరసన తెలిపారు. - 10లో▸



సమస్యల పరిష్కారానికి కృషి
ఏజెన్సీ ప్రాంతాల్లోని కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ తెలిపారు. - 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34^0 /25^0
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైద్యారోగ్యాధికారుల క్షేత్రస్థాయి సందర్శనలు



ఎంజీఎం : వైద్యారోగ్యశాఖ పథకాలు ప్రజలకు అందుతున్నాయా.. లేదా అనే విషయాలను పరిశీలించేందుకు ఆ శాఖ జిల్లా అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించారు. కడిపికొండ, ఐనవోలు, వేలేరు, వంగర, పరకాల, కమలాపూర్, ఉప్పల్, పరకాల పీపీ యూనిట్, వడ్డెపల్లి, పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోని హైపర్‌టెన్షన్, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీని పరిశీలించారు. 103మంది హైపర్‌టెన్షన్, 57మంది డయాబెటిస్ రోగుల ట్రీట్‌మెంట్ కార్డులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయి ప్రదర్శనలో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకుబ్ పాషా, ప్రోగ్రామింగ్ అధికారులు ఉమాశ్రీ, గీతాలక్ష్మి, హిమబిందు, భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆవరణలో గల రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ నందు పదేళ్లలోపు బాలబాలికలకు ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌ఓ జి.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ పరీక్షల ద్వారా ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాండ్ జంప్, 800ల మీటర్ల పరుగు, షటిల్ రన్, మెడిసిన్ బాల్, ఫ్లెక్సిబిలిటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా, సీట్ల లభ్యతకు అనుగుణంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 17, 18వ తేదీల్లో ఉదయం 8గంటలకు జేఎన్‌ఎస్‌లో హాజరు కావాలని సూచించారు. బాలబాలికలు వెంట వయస్సు, ప్రస్తుత స్కూల్ నుంచి స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ, ఆధార్, రెసిడెన్షియల్ ప్రూఫ్, 10పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, రెండు సెట్ల జిరాక్సు తీసుకుని రావాలని సూచించారు. పూర్తి వివరాలకు డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ 94410 86556, విష్ణువర్ధన్ 73864 69301 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహాసభను విజయవంతం చేయాలి

హన్మకొండ: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఆర్.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 13న హనుమకొండ బాలసముద్రంలోని సామా జగన్‌మోహన్ రెడ్డి స్మారక భవన్‌లో నిర్వహిస్తున్న మహాసభకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మహాసభ ద్వారా ఉద్యోగుల సమస్యలను విద్యుత్ యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

భద్రకాళి శేషు పదవీకాలం పెంపు

వరంగల్: భద్రకాళి దేవాలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు పదవీకాలం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శేషు 2023, జూలై 31న పదవీ విరమణ పొందారు. కాగా, మరో ఏడాదిపాటు తాత్కాలిక అర్చకుడిగా తీసుకుంటూ దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు.

'ఐనవోలు' హుండీ లెక్కింపు



ఐనవోలు: మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సాయిబాబా పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. మే 31 వ తేదీ నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు 72 రోజులకు గాను హుండీల్లో రూ.4,62,515 నగదు, వివిధ టికెట్ల ద్వారా రూ.14,88,003 వచ్చినట్లు తెలిపారు. మొత్తం రూ.19,50,518 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు వెల్లడించారు. భక్తులు కానుకలరూపంలో వచ్చిన వెండి, బంగారాన్ని యధావిధిగా హుండీలోనే వేసి సీల్ చేశామన్నారు. ఆర్‌ఐ మల్లయ్య, మహబూబాబాద్ శ్రీలక్ష్మి వేంకటేశ్వర సేవాసమితి సభ్యులు, హెడ్ కానిస్టేబుల్, దేవాలయ అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా తేలనున్న లెక్క!

జిల్లాలో 11వ వ్యవసాయ గణన
- ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో వివరాల నమోదు
- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా సర్వే
- రైతు వారీగా వ్యవసాయ కమతాల వివరాలు నమోదు



ఎల్కతుర్తి మండలం సూరారంలో మొబైల్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్ (ఏఈఓ)

హన్మకొండ: దేశంలో వ్యవసాయ స్థితిగతులు, అభివృద్ధి ప్రణాళిక, సామాజిక, ఆర్థిక విధానాల రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఐదేళ్లకోసారి వ్యవసాయ గణన చేపడుతోంది. మొదటి గణన 1970–71లో జరిగింది. ఇప్పటి వరకు 10 గణనలు జరిగాయి. 2015–16లో 10వ గణన జరగ్గా.. హనుమకొండ జిల్లాలో 11వది గురువారం నుంచి ప్రారంభమైంది. 2021–22లోనే ఈ వ్యవసాయ గణన జరగాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయిదా పడింది. సర్వేను పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్నారు. ఈసారి మాన్యువల్‌గా కాకుండా మొబైల్ యాప్ ద్వారా సర్వేకు శ్రీకారం చుట్టారు. గతంలో వీఆర్‌ఓల ద్వారా చేపట్టిన ఈసర్వేను ఈసారి క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేస్తున్నారు. ఉప గణాంక అధికారులు, మండల ప్రణాళిక గణాంక అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో స్మార్ట్ ఫోన్, ట్యాబ్స్ ద్వారా డిజిటల్ విధానంలో ఆర్‌ఎస్‌ఎస్ పోర్టల్ ద్వారా రైతుల వారీగా వివరాలు నమోదు చేస్తారు. రైతు పేరు, సామాజిక స్థితి, సాగు విస్తీర్ణం, భూమి వినియోగం (వ్యక్తిగత, సంస్థాగత), పురుషులు, మహిళలు వర్గాల వారీగా వివరాలు నమోదు చేస్తారు. ఈసర్వే రెవెన్యూ గ్రామం యూనిట్‌గా వందశాతం గణన చేస్తారు.

2015-2016 గణన వివరాలు

జిల్లాలో మండలాలు :	14
రెవెన్యూ గ్రామాలు:	163
సాగు విస్తీర్ణం:	2,58,604.60 ఎకరాలు
మొత్తం రైతులు:	1,41,918
సన్నకారు:	24,435
పాక్షిక మధ్యకారు :	7,387
మధ్యకారు :	1,576
పెద్ద :	110
ఎస్సీ:	17,717
ఎస్టీ :	2611
ఇతర రైతులు:	1,21,590

కమతాల గుర్తింపు
వ్యవసాయ కమతాలను గుర్తించాలని మొదటిసారిగా నిర్ణయించారు. మూడు దశల్లో చేపట్టే ఈగణన మొదటి దశలో భాగంగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు రైతు వారీగా వివరాలు నమోదు చేస్తారు. కమతాల వారీగా విస్తీర్ణం, సామాజిక వర్గాల వారీగా, సాగుదారుల లింగ భేదముల వారీగా విస్తీర్ణం ఇతర వివరాలు నమోదు చేస్తారు. రెండో దశలో రెవెన్యూ గ్రామంలో 20 శాతం గణన నిర్వహిస్తారు. ఇందులో నీటి పారుదల వివరాలు, పంటల వివరాలుంటాయి. మూడో దశలో గ్రామంలో 7 శాతంగా గణన నిర్వహిస్తారు. ఇందులో.. సాగు ఖర్చులు, యంత్రాలు, ఎరువులు, క్రిమి సంహారం మందుల వినియోగం, పశు సంపద వివరాలు సేకరిస్తారు. జిల్లాలో 55 మంది వ్యవసాయ విస్తరణాధికారులు ఎన్యుమరేటర్లుగా క్షేత్రస్థాయిలో గణన చేస్తారు. మండల ప్రణాళిక అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు 28 మంది వ్యవసాయ గణనను పర్యవేక్షిస్తారు. మండల వ్యవసాయ అధికారులు చార్జ్ అధికారులుగా వ్యవహరిస్తారు. ఈనెల 25లోపు వ్యవసాయ గణన పూర్తి చేయనున్నారు.

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులు, పోలీస్ సెక్టార్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన అదేశాలను అధికారులు స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. గతంలో ఎన్నికల విధులు నిర్వహించినప్పటికి ప్రస్తుతం కొత్తగానే భావించాలని, పోలింగ్ రోజు డైరీ నమోదు, ముందు రోజు నుంచి పోలింగ్ రోజు ఉదయం మాక్ పోల్ వరకు నిర్వహించాల్సిన విధులపై స్పష్టత ఉండాలన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలను ముందుగానే సందర్శించి అందులో ఉన్న ఏర్పాట్లను తెలుసుకోవాలన్నారు. లోపాలు ఉంటే సరిచేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల నిర్వహణపై ఉన్నతాధికారులకు సరైన సమాచారం అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్ జీ, పరకాల, హనుమకొండ ఆర్డీఓలు కె.శ్రీనివాస్, ఎల్.రమేష్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, తదితరులు పాల్గొన్నారు.

నార్లాపూర్ డబుల్ రోడ్డుకు రూ.25కోట్లు మంజూరు

పరకాల: గుంతలమయంగా ఉన్న పరకాల–నార్లాపూర్ డబుల్ రోడ్డు 15కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.25కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులను డబుల్ రోడ్లుగా విస్తరణ చేస్తూ నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రుల సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

నిరుద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు

హన్మకొండ అర్బన్: నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదాలతో అనేక మంది యువకులు, నిరుద్యోగుల ఆత్మ బలిదానాల వల్ల ఏర్పడిన తెలంగాణలో ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగ నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ కాలక్షేపం చేసోతందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆరోపించారు. నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్ అధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. ధర్నానుద్దేశించి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, ఉదమ్‌సింగ్‌లాంటి వారు బలిదానాలు చేసుకున్నారని, అదే స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాల చేసి సాధించి రాష్ట్రాన్ని సాధించారన్నారు. కానీ కల్వకుంట్ల కుటుంబ అవినీతి పాలనలో యువత భవిష్యత్తు అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలకు పోలీసులకు తోపులాట జరిగింది. పోలీసులు బీజేపీ, బీజేవైఎం నేతలను అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు చీర్ర నర్సింగ్ గౌడ్, సారంగపాణి, నర్మెట్ట శ్రీనివాస్, దేవరకొండ అనిల్, గొర్రె ఓం ప్రకాష్, ఆకుల శ్రీకాంత్, మధుచంద్ర, గందసిరి శ్రీకాంత్, యువ మోర్చా నాయకులు కల్లూరి పవన్, దివాకర్, నిఖిల్ చోప్రా, గౌతం, వెంకటరమణ, సాయితేజ, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు డీడబ్ల్యూఓ గైర్హాజర్

షోకాజ్ నోటీస్ జారీ చేసిన కమిషనర్

కాళోజీ సెంటర్ : మహిళా, శిశు సంక్షేమ శాఖ పనితీరుపై జిల్లా సంక్షేమాధికారులు, సీడీపీఓలతో ప్రతి మంగళవారం కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గత మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ డీడబ్ల్యూఓ శారద హాజరుకాలేదు. డీడబ్ల్యూఓ మాట్లాడాలని కమిషనర్ అడగగా జిల్లాకు చెందిన సీడీపీఓలు సమాధానం చెప్పినట్లు తెలిసింది. దీంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ముందస్తు సమాచారం లేకుండా ఎక్కడికి వెళ్లారని, కార్యక్రమం ఉందని తెలిసి కూడా విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో సమాధానం చెప్పాలని షోకాజ్ నోటీస్ జారీ చేసిన విషయం చర్చనీయాంశంగా మారింది. కొంత కాలంగా డీడబ్ల్యూఓ వ్యవహార శైలిపై కమిషనర్ ఆసహనంతో ఉన్నట్లు తెలిసింది. ఆమె కరీంనగర్‌లో పనిచేసినప్పుడు అవినీతి ఆరోపణలు వచ్చాయి. అవినీతి సొమ్మును రికవరీ చేయాలని ఉత్తర్వులు ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

వైన్స్ దరఖాస్తుల జోరు

8వ రోజు 223 దరఖాస్తులు

కాజీపేట అర్బన్: వైన్స్ దరఖాస్తులు శుక్రవారం జోరందుకున్నాయి. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లకు హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శుక్రవారం ఎనిమిదవ రోజు వరంగల్ అర్బన్ స్టేషన్‌కు 51, ఖిలావరంగల్ 51, హనుమకొండ 66, కాజీపేట 55 మొత్తం 223 దరఖాస్తులను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రామకృష్ణ స్వీకరించారు.

సంక్షేమ పథకాల అమలుతో ఆర్థిక పురోభివృద్ధి

వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



గంపను ఎత్తుకుని ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు: సంక్షేమ పథకాల అమలుతో షెడ్యూల్ కులాల్లో ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. జిల్లా ఆత్మ కమిటీ డైరక్టర్ ముల్కల గూడెం గ్రామానికి చెందిన కుసుంబ దేవేందర్ తండ్రి ఇటీవల మృతిచెందగా దేవేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల మండల కేంద్రంలో మృతిచెందిన రెండు కుటుంబాల సభ్యులను పరామర్శించారు. ఇద్దరు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ రూ.32వేల విలువ గల చెక్కులను అందజేశారు. అనంతరం కక్కిరాలపల్లి గ్రామంలో గాండ్ల వాణి అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడగా ఆమెకు మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. నందనం గ్రామంలో ఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించారు. రాంనగర్ గ్రామంలో నిర్వహిస్తున్న పెద్దెవుని వన భోజనాల పండుగలో పాల్గొన్నారు. ప్రజలు అందరిని సుఖ సంతోషాలతో ఉండే విధంగా అమ్మవారు దీవించాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. రాంనగర్ సర్పంచ్ బోయినపల్లి శ్రీనివాస్‌రావు ఇచ్చిన విందులో పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఐనవోలు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐదుగురికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.50 వేల విలువగల యూనిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయనవెంట ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అసమ్మతి ఉన్నట్టా.. లేనట్టా!

- రోజుకో మలుపు తిరుగుతున్న వర్ధన్నపేట బీఆర్‌ఎస్ రాజకీయం
- లక్షకుపైగా మెజార్టీ వస్తుందనుకున్న సీటులో అనుకోని కుదుపు
- ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపి అసమ్మతి లేదని ప్రకటన
- తాజాగా అసమ్మతి నేతల గోవా టూర్‌తో మళ్లీ ప్రకంపనలు



గోవా టూర్‌లో అసమ్మతి నేతలు

సాక్షి, వరంగల్ : వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై అసమ్మతి గళం విప్పిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇప్పుడు సేద తీరేందుకు గోవా టూర్‌కు వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. ఇప్పటికే మూడు దఫాలుగా ఈ బృందంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ సమక్షంలో అరూరి రమేష్ చర్చలు జరిపారు. విభేదాలు ఏమీ లేవని అసమ్మతికి ఫుల్‌స్టాప్ పెట్టారు. మళ్లీ ఇప్పుడు వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మినహా మిగిలిన అసమ్మతి నాయకులు గోవా టూర్‌కు వెళ్లడం బీఆర్‌ఎస్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎమ్మెల్యే అరూరి రమేషే వారిని పంపించారని ఓ వర్గం చెబుతుండగా.. అసమ్మతి నేతలంతా ఈ టూర్‌తో ఎమ్మెల్యేను మరింత డిఫెన్స్‌లో పడేట్లు చేస్తున్నారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఏదిఏమనుకున్నా లక్ష మెజార్టీ వస్తుందని లెక్కలు వేసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గంలో అంతర్గత కుమ్ములాటలతో ప్రజల్లో పార్టీ చులకన అవుతుందని బీఆర్‌ఎస్ కార్యకర్తలు వాపోతున్నారు. కావాలనే ఈ ఫొటోలు లీకు చేయడం వెనుక మైండ్ గేమ్ ఆడుతున్నట్లు కనిపిస్తోందని, ఇవి పార్టీని బలహీనం చేస్తాయని, పరోక్షంగా ప్రతిపక్ష పార్టీలకు ఆస్కారం కల్పిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కలుగజేసుకొని పార్టీ నేతలను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందంటున్నారు. ఈ బృందం బెంగళూరు, మైసూరులో దాదాపు వారం రోజులు పర్యటించనున్నట్లు తెలిసింది.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి
- తెగిన చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయాలి
- సర్వసభ్య సమావేశంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



హాజరైన అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, పక్కన కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పంటల సాగు, పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సూచించారు. జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వరంగల్ రూరల్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామాల్లో తెగిన చెరువులు, కుంటలకు మరమ్మతు చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు చేప పిల్లలు బయటకు వెళ్లకుండా చెరువులకు అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప జాలీలను తొలగించి, ప్లాస్టిక్ జాలీలను ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. త్రీ ఫేజ్ కరెంట్‌తో గ్రామాల్లో విద్యుత్ మోటార్లు కాలిపోతున్న నేపథ్యంలో లోపాలు లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చూడాలని చెప్పారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు సమావేశానికి రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు హాజరయ్యేలా చర్యలు : కలెక్టర్ ప్రావీణ్య
మండల సమావేశాలకు అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై పరిష్కారం విషయంలో వచ్చే సమావేశంలో ముందు చర్చ జరిగేలా చూడాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ఉద్యాన శాఖలో సిబ్బంది నియామకం, జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ షాపుల్లో డీలర్ల నియామకాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. చెరువుల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమ వివరాలు ముందుగా ప్రజాప్రతినిధులకు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సీఈఓ, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, అదనపు కలెక్టర్లు అశ్వినితానాజీ, శ్రీవత్సతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు కల్పన, సంజీవరెడ్డి, ఉషాదయాళ్, నరేష్‌నాయుడు, డాక్టర్ వెంకటరమణ, శారద పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం..
రైతుబీమా, రైతుబంధు పథకాల అమలులో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పర్వతగిరి జెడ్పీటీసీ బానోత్ సింగులాల్ ఆరోపించారు. మండలంలో ఇద్దరు రైతులు చనిపోతే రైతుబీమా రాలేదని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లను సందర్శించి రైతులను దోపిడీ చేస్తున్న అడ్తిదారులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే లైసెన్స్‌లు రద్దు చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, వర్ధన్నపేట జెడ్పీటీసీ భిక్షపతి కోరారు. మండల సర్వసభ్య సమావేశాలకు పీఏసీఎస్‌ల సెక్రటరీలు రావడం లేదని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. రేషన్ డీలర్లు సన్నబియ్యం ఇవ్వకుండా దొడ్డు బియ్యం ప్రజలకు పంపిణీ చేస్తున్నారని, ఖాళీగా ఉన్న రేషన్‌షాపుల్లో డీలర్లను నియమించాలని చెన్నారావుపేట జెడ్పీటీసీ పత్తినాయక్ అన్నారు. పరకాల మండలంలోని మల్లక్కపేట, పైడిపల్లి చెరువులు తెగిపోయి ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఎస్సారెస్పీ నీటిని తరలించి పంటలకు నీరందించేలా చూడాలని పరకాల జెడ్పీటీసీ సిలివేరు మొగిలి కోరారు. వర్ధన్నపేట జెడ్పీటీసీ మార్గం భిక్షపతి మాట్లాడుతూ చెరువుల వద్ద ప్లాస్టిక్ జాలీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా వరంగల్ జిల్లాకు సంబంధించిన అధికారులు హాజరైనప్పటికీ హనుమకొండ జిల్లాకు సంబంధించిన పలువురు అధికారులు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : సీపీ



వరంగల్ క్రైం: నిబద్ధతతో పనిచేసే సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో బార్బర్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ప్రతి మంగళవారం వారాంతపు సెలవు మంజూరు చేస్తూ సీపీ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సెలూన్ సిబ్బంది శుక్రవారం సీపీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సెలూన్ నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని వారికి సీపీ సూచించారు. సీపీని కలిసిన వారిలో శ్రీరాములు, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, మోహన్, సమ్మయ్య, యుగేందర్ ఉన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌లకు డీఎండబ్ల్యూఓలుగా పోస్టింగ్‌లు

న్యూశాయంపేట: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తూ ఇటీవల తహసీల్దార్ నుంచి డిప్యూటీ కలెక్టర్‌లుగా పదోన్నతి పొందిన ఇద్దరిని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారులుగా నియమించారు. వరంగల్ అధికారిగా పి.హరికృష్ణ, హనుమకొండ జిల్లా అధికారిగా పి.ఉమారాణిలను నియమిస్తూ మైనారిటీ సంక్షేమశాఖ సెక్రటరీ సయ్యద్ ఉమర్ జలీల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఫారిన్ సర్వీస్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల తహసీల్దార్‌గా పనిచేసిన విక్రమ్‌కుమార్‌ను వరంగల్ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ఎనిమిది నెలలుగా పనిచేస్తున్నారు. కాగా పదోన్నతి పొందిన డిప్యూటీ కలెక్టర్‌లకు వారి స్థాయి తగ్గట్టు పోస్టింగ్‌లు లేకపోవడంతో రెవెన్యూశాఖాధికారులు తహసీల్దార్ ర్యాంకు అధికారి అయిన వరంగల్ డీఎండబ్ల్యూఓ విక్రమ్‌కుమార్‌ని హనుమకొండ జిల్లాకు కేటాయించి, ఐనవోలు తహసీల్దార్‌గా ఇటీవల పోస్టింగ్ ఇచ్చారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ పి.హరికృష్ణకు పోస్టింగ్ ఇచ్చారు.

ఓ వైపు పోస్టింగ్.. మరోవైపు పొడిగింపు
ఐదేళ్లుగా ఫారిన్ సర్వీస్‌లో భాగంగా పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సీఈఓ మేన శ్రీను హనుమకొండ జిల్లా డీఎండబ్ల్యూఓగా పనిచేస్తున్నారు. మరో సంవత్సరంపాటు సర్వీస్ పొడిగిస్తూ శుక్రవారం పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేయడం కొసమెరుపుగా కనిపిస్తోంది. ఇప్పుడున్న డీఎండబ్ల్యూఓ మేన శ్రీనుని హనుమకొండలో కొనసాగిస్తారా లేదా నూతనంగా పోస్టింగ్ ఇచ్చిన డిప్యూటీ కలెక్టర్ ఉమారాణికి బాధ్యతలు అప్పగిస్తారా అనేది వేచి చూడాలి. హనుమకొండ, వరంగల్ డీఎండబ్ల్యూఓ పోస్టింగ్‌ల కోసం సీఎం పేషీ, మంత్రుల స్థాయిలో పైరవీలు జరిగినట్లు సమాచారం.

గుణాత్మక విద్యతోనే సామాజిక అభివృద్ధి: వీసీ


మాట్లాడుతున్న కేయూ వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: విద్య లేకుండా సమాజం వికసించదని, గుణాత్మక విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం అని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. శుక్రవారం కేయూలో విద్యావిభాగం, ఎన్‌సీపీసెల్, పీవీ నర్సింహారావు విజ్ఞాన పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏ టాక్ ఇన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–20 కాంటెక్స్ట్ ఆఫ్ ఫెడరల్ స్పిరిట్' అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో తాత్విక హేతుబద్ధ దృక్పథం ఉండాలని, విద్య అందరికీ అందించాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీ ఎన్‌సీటీఈ సదరన్ రీజియన్ కౌన్సిల్ సభ్యులు ఘంటా రమేశ్ మాట్లాడుతూ.. జాతీయ నూతన విద్యావిధానం అమలులో రాష్ట్రం బాధ్యత చాలా ఉందన్నారు. విద్యా బోధన సైంటిఫిక్‌గా ఉండాలన్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, కేయూ ఎన్‌ఈపీ సెల్ డైరెక్టర్ కృష్ణమాచార్య, విద్యా విభాగం డీన్ అడ్జెంట్ ఆచార్యులు ఎస్.రాంనాథ్‌కిషన్, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా 'కత్తిపోటు' కేసు..!

- బాధితుడి కడుపు భాగంలో మూడు కుట్లు వేసిన ఎంజీఎం వైద్యులు
- నిందితులు శ్రీనివాస్, రంజిత్‌లే చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉన్నామంటున్న నిందితులు
- మిల్స్‌కాలనీ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తేనే కథ క్లైమాక్స్‌కు

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంలోని మిల్స్‌కాలనీ ఠాణా పరిధిలో ఇటీవల సంచలనం సృష్టించిన కత్తిపోటు కేసు విచారణ పోలీసులకు సవాల్‌గా మారింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ సమయంలో వరంగల్ నగరం నడిబొడ్డున ఈనెల 5వ తేదీ రాత్రి గణేశ్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన వారం రోజులు కావొస్తున్నా.. పోలీసులు ఏం తేల్చలేకపోతున్నారు. ఎం.శ్రీనివాస్, అతడి బావమర్ది కె.రంజిత్‌కు బ్యాంకులో ఇప్పించిన దాదాపు రూ.కోటిన్నర రుణం కింద ఇవ్వాల్సిన కమీషన్ అడిగినందుకే తనపై దాడి చేశారని చారుగండ్ల శ్రీనివాస్ మిల్స్‌కాలనీ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి జరిగిన రోజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి.. అక్కడి నుంచి రక్తపు మరకలతో ఎంజీఎం ఆస్పత్రికి వెళ్తే వైద్యులు చికిత్స అందించారు. దాదాపు కడుపుపై మూడు కుట్లు వేసి మరుసటి రోజు డిశ్చార్జ్ చేశారు.

అనుమానాలెన్నో.. పోలీసులు తేల్చాల్సిందే..

- నిందితుడు ఎం.శ్రీనివాస్ అదే రోజు రాత్రి వరకు హైదరాబాద్‌లో ఉన్నట్టుగా చెప్పడంతో అక్కడి సీసీటీవీ పుటేజీలను తెప్పిస్తున్నట్టుగా తెలిసింది.
- బాధితుడు సి.శ్రీనివాస్ మాత్రం తనపై దాడి చేసింది ఎం.శ్రీనివాస్, కె.రంజిత్ అని ఖరాఖండిగా పోలీసులకు చెబుతున్నాడు. దాడి జరిగిన ప్రాంతానికి కొద్ది మీటర్ల దూరంలో నిందితుడు ఎం.శ్రీనివాస్ ఇంటి వద్ద సీసీ టీవీ కెమెరాలు కూడా ఉన్నాయి. అయితే ఆ సీసీటీవీ పుటేజీని పరిశీలించిన పోలీసులు బాధితుడు శ్రీనివాస్ అతడి ఇంటి ముందుకు వచ్చి బండిపైనే ఉండి పిలిచినట్టుగా ఉన్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.
- బాధితుడు ఆరోపిస్తున్నట్టుగా తనపై దాడి చేసిన సమయంలో అటువైపుగా కారు వెళ్లడం వల్ల బండి స్లో చేశానని, ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేస్తుండడంతో బండి పట్టుకొని ముందుకొచ్చానని చెప్పాడు.
- బాధితుడు చెప్పినట్లుగా ఆ సమయంలో అటువైపుగా వెళ్లిన కారు దృశ్యాలు సీసీటీవీ పుటేజీకి చిక్కాలి. అటువంటిదేమీ కనిపించలేదని పోలీసులు చెబుతున్నారు. అంటే ఇతడిపై దాడి జరిగి పరారైన వెంటనే ఆ కారు వెనక్కి తీసుకొని వెళ్లారా? వెళ్తే మెయిన్‌రోడ్డుపై ఉన్న సీసీటీవీ కెమెరాల్లో ఆ దృశ్యం చిక్కి ఉంటుంది కదా.. ఆ దిశగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది.
- బాధితుడే కత్తితో దాడి చేసుకొని ఇలా చేశాడన్న ప్రచారం జరిగినా.. అందులో వాస్తవం ఎంత అన్నది పోలీసులు తేల్చాలి. బాధితుడు మాత్రం తనను తాను పొడుచుకునేంత ఖర్మ పట్టలేదని, కమీషన్ ఇవ్వాలని కొన్నిరోజులుగా వారి చుట్టూ తిరుగుతున్నానని, దాని కోసం ప్రాణం తీసుకునే నాటకాలు ఆడాల్సిన అవసరం లేదని చెబుతున్నాడు. అవసరమైతే తనను మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేస్తానే తప్ప ప్రాణాలు తీసుకోవాల్సిన అవసరం లేదంటున్నాడు.
- దీంతో అసలు ఏం జరిగిందనే దిశగా పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేసి అసలు నిందితులెవరో తేల్చాల్సిన అవసరం కనిపిస్తోంది. అవసరమైతే ఆ దాడి చేసిన సమయంలో ఫిర్యాదుదారుడు శ్రీనివాస్‌తో పాటు ఇంకా ఎవరి మొబైల్ నంబర్‌లు ఆ ప్రాంతంలో పనిచేశాయి అనే దిశగా కూడా విచారించాల్సిన అవసరం ఉంది.


గణేష్‌నగర్ కాలనీలో బాధితుడిపై దాడి జరిగిన ప్రదేశం ఇదే..


చికిత్స పొందుతున్న బాధితుడు (ఫైల్)

సందర్శకులకు అల్పాహారం


హనుమకొండలో అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హన్మకొండ: తన వద్దకు వివిధ పనుల కోసం వచ్చే సందర్శకుల సౌకర్యార్థం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. హనుమకొండలోని క్యాంపు కార్యాలయం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని మంత్రి దయాకర్‌రావు ప్రారంభించి, స్వయంగా వడ్డించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను అందుబాటులో ఉండే హైదరాబాద్ మంత్రుల నివాసం, హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, పాలకుర్తి క్యాంపు కార్యాలయం, పర్వతగిరిలోని తమ ఇంటి వద్ద ఈ సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్



మాట్లాడుతున్న కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

ములుగు రూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. ఈమేరకు శుక్రవారం కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమరుల యాదిలో' సామాజిక చైతన్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గట్టమ్మ ఆలయం నుంచి జిల్లా కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు పాలకుల కుట్రలకు బలయ్యారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది కల్లుగీత కార్మికులు వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. కల్లు గీత వృత్తి ఆధునికీకరణ కార్యాచరణ రూపొందించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటామన్నారు. కల్లు గీత వృత్తిలో ఆధునికీకరణ లేక ప్రమాదాల బారిన పడుతున్నారని, నివారణ చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూ.12 కోట్లతో నీరా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం 15 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. ప్రమాదాల బారిన పడిన గీత కార్మికులకు గీత బీమా పథకంలో భాగంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బొనగాని యాదగిరిగౌడ్, జిల్లా అధ్యక్షుడు మొండయ్య, ప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య గౌడ్, రవిగౌడ్, మానస, శ్రీనివాస్, సదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా


జాఫర్, మమతను అభినందిస్తున్న పవర్‌లిఫ్టింగ్ చైర్మన్

కాజీపేట రూరల్: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–23 పోటీల్లో కాజీపేట సబ్ డివిజన్‌కు చెందిన రైల్వే ట్రాక్ ఉమెన్ (కరీంనగర్) చుంచు మమత, కాజీపేట 47వ డివిజన్ రాంనగర్‌కు చెందిన నేషనల్ ఐరన్ జిమ్ సెంటర్ ఓనర్ ఎండీ.జాఫర్ పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. సీనియర్ కేటగిరీలో మమత 57 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. అదేవిధంగా జాఫర్ 57 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు. వీరిద్దరూ త్వరలో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు చెన్నైకి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ ఎం.రమేశ్, టీఎస్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ చేతుల మీదుగా జాఫర్ గోల్డ్‌మెడల్, ప్రశంస పత్రం అందుకున్నారు. డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్ చేతుల మీదుగా మమత రెండు గోల్డ్‌మెడల్స్, ప్రశంసపత్రం అందుకున్నారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూ తేదీలు ఖరారు

కేయూ క్యాంపస్: కేయూలో ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ ఫార్మసీ విద్యా విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూల తేదీలను వర్సిటీ అధికారులు ఖరారు చేశారు. గత నెల మూడో వారంలో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వర్షాల కారణంగా వాయిదా వేశారు. ఇటీవల అన్ని విభాగాల డీన్‌లతో వీసీ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు సమావేశమై తేదీలను ఖరారు చేశారు. సోషల్ సైన్స్‌లోని వివిధ విభాగాల్లో ప్రవేశాలకు ఈనెల 17 నుంచి 20 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఈనెల 17, 18 తేదీల్లో, సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఈనెల 21 నుంచి 26 వరకు, ఆర్ట్స్ తెలుగు విభాగంలో ఈనెల 22, 23 తేదీల్లో, ఇంగ్లిష్ విభాగంలో 25, 26 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. విద్యా విభాగంలో భాగంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ఈనెల 24న, ఫార్మసీ విభాగంలో 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆయా డీన్‌లు బన్న అయిలయ్య, టి.మనోహర్, పి.మల్లారెడ్డి, పి.అమరవేణి, వై.నర్సింహారెడ్డి, ఎస్.రాంనాథ్ కిషన్‌లు తమ విభాగాల్లో ప్రవేశాలకు సంబంధిత అభ్యర్థులకు ఇంటర్వ్యూల కాల్ లెటర్లు పంపిస్తున్నారు. అభ్యర్థులకు వాట్సాప్ ద్వారా ఇంటర్వ్యూల తేదీలను సమాచారం అందించనున్నట్లు సమాచారం. మెరిట్‌కమ్ రిజర్వేషన్ పద్ధతిలో నిబంధనల ప్రకారమే పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించాలని వీసీ ఇదివరకే తాటికొండ రమేశ్ డీన్‌లను ఆదేశించారు. నోటిఫికేషన్ సందర్భంగా ఎన్ని సీట్లు వెకెన్సీలుగా విభాగాల వారీగా చూపారో.. ఆయా సీట్లలోనే భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు తమ రీసెర్చ్ ప్రపోజల్స్‌తో పాటు హాజరు కావాల్సి ఉంటుంది.

చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దు

- రోడ్డెక్కిన సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు
- కాటారం మండలం దామెరకుంటలో ఆందోళన


రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కాటారం: 'పాఠశాలలో ఉపాధ్యాయులు చదువు చక్కగా చెప్పడం లేదు. ఈవిషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దు' అని కాటారం మండలం దామెరకుంట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. పాఠశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు దామెరకుంట–గంగారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు సరిగ్గా బోధించడం లేదని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. పాఠశాల, కళాశాలలో మూడ్రోజులుగా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు సరిపడా లేవని, ప్రహరీ చిన్నగా ఉండడంతో ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించట్లేదని, విజిటింగ్ కోసం వచ్చిన తల్లిదండ్రులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కించపర్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటలు ఆందోళన కొనసాగింది. వారికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు యువకులు మద్దతు తెలిపారు. సమాచారం అందుకున్న ట్రైనీ ఎస్సై ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి విద్యార్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఆర్‌సీఓ విచారణ..

విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీఓ విద్యారాణి పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ మైథిలీతో, విద్యార్థులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌సీఓ హామీ ఇచ్చారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.


రామకృష్ణారెడ్డి మృతదేహం

ములుగు రూరల్: అప్పుల బాధతో ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన ఎర్రం రామకృష్ణారెడ్డి(43) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు తనకున్న రెండెకరాల భూమితో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి పూర్తిగా పాడైంది. దీంతో పంట సాగుకు చేసిన రూ.3.5 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. చేను వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న రామకృష్ణారెడ్డిని స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి తండ్రి నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. కాగా.. బాధిత కుటుంబాన్ని ములుగు ఎమ్మెల్యే సీతక్క, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ అమ్జద్‌పాషా పరామర్శించారు. విషయం తెలుసుకున్న పంట నష్టంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు పంటను పరిశీలించారు. వరదల కారణంగా రైతు రామకృష్ణారెడ్డికి చెందిన పత్తి పూర్తిగా నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి సంతోశ్ తెలిపారు.

పంట నష్టంతో మనస్తాపం చెంది రైతు


గట్టు రాజయ్య(ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అప్పుల బాధతో రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన రైతు గట్టు రాజయ్య(55) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజయ్య తనకున్న ఎకరం భూమితో పాటు, మరో ఎకరంన్నర భూమిని కౌలుకు తీసుకున్నాడు. గతేడాది మిర్చి పంటకు తెగులు సోకి పంట పూర్తిగా నష్టపోయింది. సుమారు రూ.5 లక్షల మేర అప్పు అయ్యింది. ప్రస్తుతం పత్తి సాగు చేయగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఉన్న పత్తి మొక్కలకు నీరు పారించేందుకు వ్యవసాయ బావివద్దకు వెళ్లి మోటారు ఆన్ చేయగా.. మోటారు కాలిపోయింది. దిక్కుతోచని స్థితిలో రైతు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బావిలో దూకి ఒకరు..


రాజు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: కుటుంబ కలహాలతో మహబూబాబాద్ మండలం సోమ్లా తండాకు చెందిన తేజావత్ రాజు(38) శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా రాజు కుటుంబంలో కలహాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్నెళ్ల క్రితం రాజు భార్య రాజేశ్వరి పుట్టింటికి వెళ్లింది. రాజు మాత్రం తండాలోనే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని నల్లాల బావిలో ఒక మృతదేహం కనిపిస్తోందని, దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి తేజావత్ రాజుగా గుర్తించారు. మృతుడి అన్న కోబల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వీఆర్‌ఏ ..


సమ్మయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన చెక్క సమ్మయ్య(70) వీఆర్‌ఏ ఆత్మహత్య చేసుకున్నాడు. సమ్మయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు చనిపోగా.. పెద్ద కొడుకుకు ఒక కుమారుడున్నాడు. ఇటీవల ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం అందించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో సమ్మయ్య తాను ఉద్యోగం చేయనని, చిన్న కుమారుడు, పెద్ద కుమారుడి కొడుకు(మనవడు) ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడాడు. ఇరువురి మధ్య బేధాభిప్రాయాలు రాగా.. ఉద్యోగం వృథాగా పోతుందని మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. చికిత్స కోసం చిట్యాల ఆస్పత్రికి తీసుకురాగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.. మృతుడి భార్య రాయమల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి


వీరరావు మృతదేహం

పరకాల/రేగొండ: ఆర్టీసీ బస్సు అతివేగం.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం పోయింది. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రైతు భలేరావు వీరరావును భూపాలపల్లి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా వీరారావు మృతి చెందాడు. వీరారావు పురుగుల మందు కొనేందుకు బైక్‌పై పరకాలకు వెళ్లాడు. ఈక్రమంలో అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ వద్ద వెనుక నుంచి భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన (టీఎస్ 25జెడ్ 0028) నంబర్ గల సూపర్ లగ్జరీ బస్సు అతడిని ఢీకొట్టింది. స్థానికుల సహకారంతో పోలీసులు అతడిని పరకాల సివిల్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. కిడ్నీ నుంచి తీవ్రరక్త స్రావమై మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బస్సును స్వాధీనంలోకి తీసుకొని కొంపెల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ రామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పరకాల సీఐ వెంకటరత్నం తెలిపారు.

అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన

వీరరావు మృతి సమాచారం తెలియగానే నారాయణపూర్ గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకొని పరకాల అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్ఐ శివకృష్ణ ఆందోళనను విరమింపజేశారు.

పిచ్చి కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్తవాడకు చెందిన తోటకూరి వెంకన్న–రేణుక దంపతుల కుమారుడు జీవన్‌పై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాలుడి ఎడమ చేతికి తీవ్ర గాయమై రక్తస్రావం అవుతుండడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు బాలుడి తాత మహంకాళి తెలిపారు.

సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపాలి


మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై మాజీ ఎంపీ బలరాంనాయక్, బెల్లయ్య నాయక్ తదితరులు

- టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మాటలతో మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగింది. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నందన గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న మానుకోట ప్రాంతం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికలు దగ్గరపడ్డాయని కేసీఆర్ రుణమాఫీ అంటూ ముందుకొస్తున్నారని విమర్శించారు. నాలుగు నెలలు వైన్‌షాపులకు గడువున్నా.. ముందుగానే టెండర్లు పిలిచి సమయం కేటాయించారని, కానీ.. పేదలు కోరుకునే గృహలక్ష్మి పథకానికి మాత్రం 3 రోజులే సమయం ఇచ్చారన్నారు. వైఎస్సార్ హయంలో ఇల్లులేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, 8 లక్షల ఎకరాలకు పైగా.. పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, పటేల్ రమేశ్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ మానుకోట పార్లమెంట్ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఎడవెల్లి కృష్ణ, రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, నేతలు వెన్నం లక్ష్మారెడ్డి, నూనావత్ రాధ, రామచంద్రునాయక్, నెహ్రూనాయక్, ఎదల్ల యాదవరెడ్డి, తోట వెంకన్న, బోడ రవినాయక్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, అల్లం నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, నూనావత్ రమేశ్, ప్రభాకర్‌గౌడ్, సతీశ్, గునిగంటి కమలాకర్, నీరుటి లక్ష్మీనారాయణ, భూక్య శ్రీనివాస్, కత్తిస్వామి, ఎండీ హారుణ్, అంబాల శివకుమార్, నర్సింగ శ్రీనివాస్, పద్మం ప్రవీణ్, తూళ్ల ప్రణయ్, బండి శ్రీను, ముత్తినేని సోమేశ్వర్‌రావు, వీరన్నయాదవ్ ఉన్నారు.

విద్య, వైజ్ఞానిక తరగతులను విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు, విజయవంతం చేయాలని ఆ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేశ్ కోరారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు నరేశ్, ప్రవీణ్, వాసు, నిరంజన్, రాహుల్, నగేశ్, వినయ్, చరణ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.